



మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

మంగళవారం 11 ఆగష్టు 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 3




# లయన్స్ ఐ హాస్పిటల్ చైర్మన్‌గా మీలా మహదేవ్ ఏకగ్రీవ ఎన్నిక









భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

సూర్యాపేట లయన్స్ ఐ హాస్పిటల్ నూతన చైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధాకర్ పీవీసీ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం లయన్స్ ఐ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నూతన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిరాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ ఐ హాస్పిటల్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పెండెం చంద్రశేఖర్, కోశాధికారిగా చిలుముల శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా తోట శ్యామ్ ప్రసాద్, కక్కిరేణి చంద్రశేఖర్, పోలబోయిన నర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా ఈగ దయాకర్ గుప్త ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా నూక వెంకటేశం గుప్తా, భోనగిరి భాస్కర్, చల్లా లక్ష్మీకాంత్, బెలిదె అంజయ్య, మిర్యాల సుధాకర్, కుమ్మరికుంట్ల లింగయ్య, ఆరె సురేష్ రెడ్డి, పటేల్ నర్సింహా రెడ్డి, రాచకొండ శ్రీనివాస్, ధర్మారావు ఎన్నికయ్యారు.గౌరవ సలహాదారులుగా గుణగంటి రాములు, మొరిశెట్టి లక్ష్మాది, గుడిపూడి వెంకటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లయన్స్ కంటి ఆసుపత్రి ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు





భానుపురి /సూర్యాపేట టౌన్

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు అని సూర్యాపేట రైల్వే సాధన సమితి కో కన్వీనర్ ఆదుర్తి రమేష్ చంద్ర తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రైతు బజార్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో గత నెల రోజులుగా ప్రజాభిమతానికి అనుగుణంగా ఉద్యమము చేస్తున్న రైల్వే సాధన సమితి కో కన్వీనర్ రాచూరి ప్రతాప్ ను అరెస్టు చేయడం ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన తో శాంతి భద్రతల పరిరక్షణ కొరకు అంటూ పోలీసులు రైల్వే సాధన సమితి కోకన్వీనర్ రాచూరి ప్రతాప్ ను అరెస్టు చేయడం తగదు అన్నారు.గత 40 ఏళ్లుగా సూర్యాపేట పట్టణానికి అనుసంధానంగా రైల్వే మార్గం రావాలని కోరుతు ప్రశాంతంగా ఉద్యమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సూర్యాపేట ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే లైన్ కొరకు ప్రతి ఒక్కరు స్పందించి రైల్వే మార్గ లక్ష్యసాధనకు మద్దతు ఇవ్వాలని తెలిపారు. రైల్వే మార్గం కు సహకరించకుంటే తెలంగాణ ఉద్యమం లా మరో రైల్వే సాధన ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సాధన సమితి కో కన్వీనర్ రాచూరి ప్రతాప్ సభ్యులు గుండా రమేష్ , యాతాకుల రాజయ్య, నారబోయిన వెంకట్ యాదవ్, అక్కెనపల్లి రాము, వినయ్ మాల, బత్తుల వెంకన్న, కుసుమ సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపల్ షాపులు బహిరంగ వేలం

-మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి..

భానుపురి /సూర్యాపేట టౌన్



సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న పలు మున్సిపల్ షాపులను బహిరంగ వేలం ద్వారా అద్దెకు ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంత్ రెడ్డి తెలిపారు. పాత మున్సిపల్ కార్యాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ షాపులతో పాటు స్వామి వివేకానంద షాపింగ్ కాంప్లెక్స్, కిషన్‌గంజ్ కూరగాయల మార్కెట్, అలంకార్ థియేటర్ ఎదురుగా ఉన్న షాపులను వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి గల వ్యక్తులు మున్సిపల్ కార్యాలయ పని వేళల్లో రూ.50 చెల్లించి దరఖాస్తు ఫారం పొందాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు, షరతులకు లోబడి పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల18వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. 19వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలానికి సంబంధించిన ఇతర వివరాల కోసం కార్యాలయ పని వేళల్లో మున్సిపల్ రెవెన్యూ విభాగాన్ని సంప్రదించాలని కమిషనర్ సూచించారు..

# మతం మారితే హక్కులు మారకూడదు

-దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వాలి

భానుపురి /సూర్యాపేట టౌన్



దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించి, రాజ్యాంగం ప్రకారం ఎస్సీలకు అందుతున్న రిజర్వేషన్లు, రాయితీలు, హక్కులను వర్తింపజేయాలని పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు బిషప్ సీహెచ్ సాల్మాన్‌రాజ్, పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ శాంసన్ మామిడి, పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ ఎం. ప్రభుదాస్ డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం ఎక్స్‌రోడ్డు వద్ద బ్లాక్‌డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950లో అమలులోకి వచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వుల కారణంగా మతం మారిన దళిత క్రైస్తవులు రాజ్యాంగపరంగా తమకు దక్కాల్సిన ఎస్సీ హోదా, రిజర్వేషన్లకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన దళితులకు ఎస్సీ హోదా కల్పించిన విధంగానే దళిత క్రైస్తవులకు కూడా సమాన హక్కులు కల్పించాలని కోరారు. మతం మారినంత మాత్రాన దళితుల సామాజిక పరిస్థితులు మారవని, వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో వారికి రాజ్యాంగపరమైన రక్షణలు, హక్కులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వాన్ని, ఆర్టికల్ 16 సమాన అవకాశాలను కల్పిస్తున్న నేపథ్యంలో దళిత క్రైస్తవుల విషయంలో వివక్ష కొనసాగడం బాధాకరమన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికలు, సామాజిక కార్యక్రమాలు, విద్య, ఉద్యోగాలు తదితర రంగాల్లో దళిత క్రైస్తవులు వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు. దళిత క్రైస్తవుల సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మానవ హక్కుల సమస్యగా చూడాలని నాయకులు కోరారు. దేశంలోని ఇతర వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అందుతున్నప్పుడు దళిత క్రైస్తవులకు మాత్రం వాటిని నిరాకరించడం సమానత్వ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విద్య, ఉద్యోగాలు, సామాజిక, ఆర్థిక రంగాల్లో దళిత క్రైస్తవులకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల న్యాయమైన డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా పరిశీలించాలని కోరారు. గతంలో వివిధ ప్రభుత్వాలు, రాష్ట్ర అసెంబ్లీలు ఈ అంశంపై కేంద్రానికి సిఫార్సులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించి కేంద్ర ప్రభుత్వానికి బలమైన సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే వరకు ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. తాము కూడా ఓటు హక్కు కలిగిన భారత పౌరులమని, తమ సమస్యను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు ఫాస్టర్లు పాల్గొన్నారు..

# నాగార్జునసాగర్ లో వైభవంగా వరుణయాగం





**-108 మంది రుత్వికులతో యాదగిరి అర్చకుల ఆధ్వర్యంలో వైదిక క్రతువులు**

భానుపురి /నాగార్జునసాగర్

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని దేవీదేవతలను వేడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్ లోని విజయ్ విహారం వద్ద కృష్ణా నది ఒడ్డున నిర్వహించిన ఈ పవిత్ర వరుణ యాగంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని రుత్వికుల మార్గదర్శకత్వంలో యాగక్రతువులను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

**11 హోమగుండాలు - 108 రుత్వికులు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులతో 11 హోమగుండాలతో వరుణదేవుని అనుగ్రహాన్ని ఆకాంక్షిస్తూ వైదిక విధానంలో హోమక్రతువులు నిర్వహించారు. ఈ పవిత్ర యాగంలో మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు.

**సీఎం ప్రార్థన**

దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణంలో కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలన్న సంకల్పంతో ఈ వరుణ యాగం నిర్వహించామని తెలిపారు.



**సంప్రదాయం - శాస్త్రం కలయిక**

భారతీయ సంస్కృతిలో వర్షాలు కురవాలని యాగాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక సంప్రదాయమన్నారు. ఒకవైపు శాస్త్రీయ అంచనాలు, ప్రణాళికలతో ప్రభుత్వం ముందుకు వెళ్తూనే, వర్షం, వ్యవసాయం, ప్రకృతి, మానవ జీవితం పరస్పర సంబంధాన్ని ప్రతిబింబించే సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రకృతి అనుగ్రహించాలని వేడుకున్నారు.

**ఎల్ నినో నేపథ్యంలో**

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ మహా వరుణయాగాన్ని నిర్వహించింది.

**సీఎం సంకల్పం**

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి. కృష్ణా గోదావరి నదులు నిండుగా ప్రవహించాలి. శ్రీశైలం, నాగార్జునసాగర్ లతో పాటు అన్ని ప్రాజెక్టులు నిండాలి. రాష్ట్రంలోని ప్రతి చెరువు, ప్రతి కుంట జలకళతో కళకళలాడాలి. భూగర్భ జలాలు పెరగాలి. పంటలు పుష్కలంగా పండాలి. రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాలి. రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలి"లి అని ముఖ్యమంత్రి గారు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ పవిత్ర వరుణయాగ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవ రావు, పి. సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి కె. జానారెడ్డి తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ

భానుపురి/సూర్యాపేట ఎస్పీ కార్యాలయం



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి ని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సూర్యాపేటలో ఐసీసీఎస్ఎల్ నూతన బ్రాంచ్ త్వరలో ప్రారంభం

భానుపురి /సూర్యాపేట టౌన్



1998 లో స్థాపించబడిన ప్రతిష్టాత్మక మల్టీ-స్టేట్ కోఆపరేటివ్ సొసైటీ అని సంస్థ తన సేవల ద్వారా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందిందని ఐసిసిఎస్ఎల్ మార్కెటింగ్ హెడ్ ఏపీ, తెలంగాణ అడ్వైజరీ ఆఫీసర్ గుడిమెట్ల మహేశ్వర్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రిబుల్ ఆర్ బ్రాకెట్ హాల్ లో సుమారు 100 మంది సభ్యులు మార్కెటింగ్ రంగంలో అనుభవం ఉన్న ప్రముఖులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐసీసీఎస్ఎల్ మార్కెటింగ్ హెడ్ మరియు ఏపీ, తెలంగాణ అడ్వైజరీ ఆఫీసర్ గుడిమెట్ల మహేశ్వర్ హాజరై, సంస్థ కార్యకలాపాలు, నూతన బ్రాంచ్ ప్రారంభం, ఉపాధి అవకాశాలు వ్యాపార అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. తమ సంస్థ ద్వారా కార్యకలాపాలను సూర్యాపేటలో ప్రారంభించ బోతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ బ్రాంచ్ ద్వారా సూర్యాపేట ప్రాంతంలోని అనేక మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, స్థానిక వ్యాపారస్తులకు వ్యాపార రుణాలు ఆర్థిక సేవలు అందించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతామని తెలిపారు. సూర్యాపేట బ్రాంచ్ ఏర్పాటుకు సహకరిస్తున్న ప్రముఖులు బాసాని వెంకటయ్య, జీడి వీరస్వామి, నాయిని శ్రీనివాసరావు, ఆకారపు రమేష్, శ్రీరాముల ఆంజనేయులు, గద్దె నాగ స్వామి, లకు అమూల్యమైన సహకారం, ప్రోత్సాహం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. సూర్యాపేట సమావేశం -- 09 ఆగస్టు 2026 సూర్యాపేట లో ఐసీసీ ఎస్ఎల్ బ్రాంచ్ త్వరలో ప్రారంభం కానుండటంతో సమావేశానికి హాజరైన వారు హర్షం వ్యక్తం చేశారు. బ్రాంచ్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే, సంస్థ ద్వారా తమకు స్థానిక యువతకు మంచి ఉపాధి వ్యాపార అవకాశాలు లభించనున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## రైల్వే సాధన సమితి ఉద్యమ కారులకు ఆర్య వైశ్యుల మద్దతు ఉంటుంది

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట వాసులకు రైలు రావడం చిర కాల కోరిక అని అది సాకారం చేసేందుకు చివరి వరకు శాంతి యుతంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ నాయకులు బండారు రాజా తెలిపారు. సూర్యాపేటకు మొదట కేటాయించిన బుల్లేట్ ట్రైన్ అలైన్మెంట్ ను పునరుద్దరిం చాలంటూ ఉద్యమిస్తున్న రైల్వే సాధన సమితి సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రైల్వే సాధన కోసం పోరాడుతున్న నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం తగదు అన్నారు. కేంద్ర ప్రభుత్వం శంషాబాద్ నుంచి సూర్యాపేట, అమరావతి మీదుగా చెన్నై వెళ్ళాల్సిన రైలు మార్గాన్ని ఎందుకు మార్చాల్సి వచ్చిందో తెలంగాణ ప్రజలకు తెలుపాలి అన్నారు. రైలు మార్గం సూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల స్వప్నమని ఈ రైలుమార్గం వస్తే ఈ ప్రాంతం మరింత అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. నాయకుల అరెస్టులతో రైల్వే సాధన ఉద్యమాన్ని ఆపలేరని రైల్వే సాధన సమితి చేస్తున్న ఉద్యమానికి ఆర్యవైశ్యుల మద్దతు ఉంటుందని తెలిపారు.

## సూర్యాపేట లో జైల్ భరో

భానుపురి/సూర్యాపేట టౌన్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన జైలు భరో కార్యక్రమం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వివిధ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, మహిళా, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించగా పోలీసులు అడుగడుగునా అడ్డుకుని నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన భారీ ప్రదర్శనలో తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం, సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, ప్రగతిశీల మహిళా సంఘం, రైతాంగ సమితి, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్యూ తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రదర్శన ముందుకు సాగకుండా పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నారు. దీంతో ప్రజా సంఘాల నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సూర్యాపేట డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో నాయకులు తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. నిరసనకారులను అడ్డుకునే క్రమంలో పోలీసులు దురుసుగా వ్యవహరించారని, అసభ్య పదజాలం ఉపయోగించారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. మహిళా నాయకులను సైతం పోలీసులు చూడకుండా అరెస్టు చేయడం పై తీవ్ర నిరసన వ్యక్తమైంది. మహిళా నాయకులను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులకు, మహిళా నాయ కులకు మధ్య కూడా తీవ్ర వాగ్వాదం చోటుచేసు కుంది. దీంతో కొంతసేపు సూర్యాపేట జిల్లా కేంద్రం లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిమల్లు లక్ష్మి, ఏఐకే ఎంఎస్ రాష్ట్ర నాయకులు మండారి డేవిడ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాలపల్లి శ్రీను మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీసే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజల హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడ మేనని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఎన్ని నిర్బంధాలు విధించినా అడ్డు కోలేరని స్పష్టం చేశారు. కార్మికులకు, రైతులకు, వ్యవ సాయ కార్మికులకు న్యాయం జరిగే వరకు ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్య్ర కమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అక్షర ఫౌండేషన్ కు వైకుంఠ రథం వాహనం అందజేత

భానుపురి/సూర్యాపేట టౌన్



ఎస్ కె ఆర్ కన్స్ట్రక్షన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారు సూర్యాపేట జిల్లా ప్రజలకు ఉపయోగపడే 14 లక్షల మహేంద్ర బొలెరో వైకుంఠ రథం వాహనం అక్షర ఫౌండేషన్ సభ్యులకు ఎస్ కే ఆర్ కన్స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ సంకినేని కృష్ణారావు అందజేశారు. సంకినేని కృష్ణారావు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో వైకుంఠ రథ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అక్షర ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రంగి కాళిదాస్ మాట్లాడుతూ హాస్పిటల్లో చనిపోయిన మృతదేహాలను వారి గ్రామాలకు చేరవేయుట, అత్యవసర సమయములో మృతదేహాలను రవాణా చేయుట, సూర్యాపేట పట్టణం పరిసర ప్రాంత గ్రామాలలో దహన సంస్కారాలకు వైకుంఠ రథ సేవలు అందించుట, వీటితోపాటు డెడ్ బాడీ ఫ్రీజర్స్ కూడా 24 గంటలు ట్యాంక్ బండ్ దగ్గర గల హిందూ మహా ప్రస్థానం నందు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ వైకుంఠ రథ సేవలు సూర్యాపేట జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోగలరు. ముమ్మందు అక్షర సేవలు ఇంకా విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ యాస రాంకుమార్ రెడ్డి, బత్తుల దామోదర్ రెడ్డి, ఉప్పల మధు, రమేష్, మందడి రమాదేవి, షేక్ నజీర్ భాష, బత్తుల ఉపేందర్, ధరావత్ వీరాసింగ్, రామకృష్ణ, గడ్డం వీరబాబు, జటంగి ముత్తయ్య, నాగరాజు,యాస అక్షయ్ రెడ్డి, వివేకానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యుల అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధం

భానుపురి/సూర్యాపేట టౌన్



సూర్యాపేట పట్టణానికి రైలు రాక ప్రజల చిరాకల స్వప్నమని దాన్ని సాకారం చేసేందుకు చివరి వరకు పోరాడుతామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సూర్యాపేటకు మొదట కేటాయించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ను పునరుద్ధరించాలంటూ ఉద్యమిస్తున్న బుల్లెట్ ట్రైన్ సాధన సమితి సభ్యులను సీఎం రేవంత్రెడ్డి పర్యాటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సమస్యల సాధన కోసం, ప్రజల స్వప్నాలను సాకారం చేసేందుకు కంకణబద్దులై పోరాడుతున్న నాయకుల ను అక్రమంగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. కేంద్రప్రభుత్వం మొదట శంషాబాద్ నుంచిసూర్యాపేట, అమరావతి మీదుగా చెన్నై వెళ్ళాల్సిన రైలు మార్గాన్ని ఎందుకు మార్చాల్సి వచ్చిందో మార్చడం వెనుక ఎవరి ప్రయోజనాలు న్నాయో యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. రైలు మార్గం సూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల స్వప్నమని ఈ రైలుమార్గం వస్తే ఈ ప్రాంతం మరింత అన్ని రంగాల్లో అబివృద్ధి చెందుతుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకుల అరెస్టులతో రైల్వే సాధన ఉద్యమాన్ని ఆపలేరని రైల్వే సాధన సమితి చేస్తున్న ఉద్యమాకి భారత రాష్ట్ర సమితి తరపున తాము పూర్తి అండగా ఉంటామని అన్నారు. మొదట కేటాయించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ను పునరుద్ధరించే వరకు ముఖ్యమంత్రి, మంత్రులు ఎంతటి వారైనా ఎక్కడికక్కడ దిగ్బంధించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం

భానుపురి /పెన్ పహాడ్




తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) మండల నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వగ్గ సోమన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన సూర్యా పేట జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య, జిల్లా కార్యదర్శి ముషం హరిప్రసాద్ ల సమక్షంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది మండల అధ్యక్షుడిగా నీలకంఠం జయరామకృష్ణ, ఉపాధ్యక్షుడి గా మీసాల నాగయ్య, కార్యదర్శిగా గంగారపు హరికృష్ణ, కోశాధికారిగా కత్తి ఉపేందర్, సహాయ కార్యదర్శిగా మామిడి సైదులు, సంయుక్త కార్యదర్శిగా నన్నే పంగ నవీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య మార్గదర్శకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం పని చేస్తోందన్నారు. హైకోర్టు వెలువరించిన తీర్పులో జర్నలిస్టుల అక్రిడేషన్ కమిటీలో సంఘానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించి ంది. ప్రతి జర్నలిస్టుకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడం తో పాటు ఇళ్ల స్థలాలు, ఇతర సంక్షేమ అంశాలపై పోరాడు తామని తెలిపారు. విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరిగే దాడులను ఖండిస్తూ, వారి సమస్యల పరిష్కారా నికి సంఘం అండగా నిలుస్తుందన్నారు. జిల్లా కార్య దర్శి ముషం హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయి ల నుంచి నూతన కమిటీకి పూర్తి సహకారం అంది స్తామని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వగ్గ సోమన్న మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతే బలమని, నూతన కమిటీ సభ్యులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచిస్తూ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేస్తా మని, యూనియన్ నుంచి అవసరమైన సహాయ సహ కారాలు అందించాలని కోరారు.

## టిఆర్టిఎఫ్ ప్రధాన కార్యదర్శిగా పెండెం శ్రీనివాసులు

కట్టంగూర్, ఆగస్టు 10,



తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) కట్టంగూరు మండల నూతన ప్రధాన కార్యదర్శిగా పరడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ పెండెం శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో టిఆర్టిఎఫ్ మండల అధ్యక్షులు చిట్టబోయిన లింగయ్య అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఈ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టిఆర్టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి నూతనంగా ఎన్నికైన పెండెం శ్రీనివాసులుకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి పెండెం శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో టిఆర్టిఎఫ్ సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి కృషి చేస్తానని స్పష్టం చేశారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు, ఉపాధ్యాయు లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్టిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తరాల పరమేశ్ యాదవ్, రాష్ట్ర గౌరవ సలహాదారులు ముప్పిడి మల్లయ్యతో పాటు పలువురు మండల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

# జైల్‌భరో'లో భాగంగా సీఐటీయూ రాస్తారోకో

కట్టంగూర్, ఆగస్టు 10:



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని,నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం లో భారీ 'జైల్‌భరో' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ టీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు మాట్లాడుతూ కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ఉపాధి, కార్మిక వర్గాల హక్కులను కాలరాస్తోందని మండి పడ్డారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న29చట్టాలనురద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్లుగా మార్చడం వల్ల ఉద్యోగ భద్రత తీవ్రంగా దెబ్బతింటుం దన్నారు. కార్మికుల న్యాయమైన సమస్య లను పరిష్కరించకుంటే రానున్న రోజు ల్లో పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తా మని నాయకులు హెచ్చరించారు. అనంతరం నిరసనకారులు కేంద్ర ప్రభు త్వానికి వ్యతి రేకంగా పెద్ద ఎత్తున నినా దాలు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళి, గ్రామ పంచాయతీ జిల్లా అధ్యక్షుడు పొన్న అంజయ్య ,ఆశా వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటివెంకటమ్మ, సీఐ టీయూ మండల కన్వీనర్ చెరుకు జానకి, నాయకులు మురారి మోహన్, జాల ఆంజనేయులు, ముస్కురవీందర్, గోగుశేఖర్, అబ్బాగోని చంద్రమ్మ, మాచర్ల యాదమ్మ, ఏకుల యాదమ్మ, కొరివిశంకర్, ఏరు చంద్రయ్య, బండారుకిరణ్తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధికి శిక్షణ

నకిరేకల్, ఆగస్టు 10



: లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్, నవ్య, సెంటెనియల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో లయన్ క్వెస్ట్ ప్రోగ్రామ్ ఈనెల 9, 10 తేదీలలో స్థానిక శాస్త్ర పాఠశాలలో నిర్వహించారు నకిరేకల్ పట్టణం లోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు 30 మందికి విద్యార్థుల నైపుణ్యం పెంపొందించుటకు లయన్స్ క్వెస్ట్ శిక్షణ ఏర్పాటు చేశారు. చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, కో-చైర్మన్ లోకసాని సరితారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా గవర్నర్ కే.వి. ప్రసాద్ హాజరై మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ క్లబ్బులు ఎన్నో గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వివరించారు. శిక్షణ పొందిన వారికి అతిథుల చేతుల మీదుగా సర్టిఫికేట్స్ అందజేశారు. ప్రోగ్రామ్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండా సంతోష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మల్టీపుల్ జీఎస్టీ, క్వెస్ట్ గ్రాంట్ కోఆర్డినేటర్ తీగల మోహన్ రావు, పీజీడీ డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-1 కోడె సతీష్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్-2 గూడి పూడి వెంకటేశ్వరరావు,లయన్ క్వెస్ట్ శిక్షకురాలు కొండపల్లి రేణుక, చార్టర్ ప్రెసిడెంట్ కందాల పాపిరెడ్డి, జోన్ చైర్మన్ సుధాకర్, సెంటెనియల్ చార్టర్ ప్రెసిడెంట్ యానాల రజనీ కాంత్‌రెడ్డి, లయన్స్, నవ్య క్లబ్స్ అధ్యక్షులు సూర్య చందర్‌రావు, పద్మజ, జిల్లా చైర్మన్లు రేపాల సతీష్ ఎన్.రామ్మోహన్‌రావు, సూర్యకుమార్, రావిరాల అశోక్, పాఠశాలల ప్రతినిధులు, నాగేశ్వర్‌రావు, నాగరాజు, గంగరాజు, సుధాకర్, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైశ్య భవన్ కు స్టీల్ సామాగ్రి అందజేత

నకిరేకల్, ఆగస్టు 10



వాసవి క్లబ్, వాసవి క్లబ్ కపుల్స్, వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో వైశ్య భవన్ కు స్టీల్ సామాగ్రి అందజేశారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ గుండా నరేందర్, గుండా కరుణ, జోన్ చైర్మన్ కందగట్ల శ్వేత, దేవరశెట్టి సత్యనారాయణ, క్లబ్స్ అధ్యక్షులు బ్రహ్మదేవర వేణు కందగట్ల బాలాజీ, గుండా స్రవంతి, ప్రధాన కార్యదర్శులు వాడకట్టు సంతోష్, శ్రీకాకోళ్ళ వెంకన్న, కోశాధికారులు వీర్లపాటి కృష్ణ, గుండా శ్రీకాంత్ ఆర్యవైశ్యపట్టణ అధ్యక్షులు వీరవెల్లి రఘునాథ్, సెక్రెటరీ ఉప్పల సంతోష్, సభ్యులు ఉప్పల శివకృష్ణ, చందా కృష్ణయ్య, వజ్రపు సంతోష్, మురారిశెట్టి శివ, వనమా సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 16న ముత్యాలమ్మ పండుగ

నకిరేకల్, ఆగస్టు 10




నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ ఈ నెల 16 న ఆదివారం ముత్యాలమ్మ అమ్మవారి పండుగను జరుపుకోవాలని నిర్ణయించడం జరిగిందని ముత్యాలమ్మ గుడి పండుగ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం పట్టణ ప్రముఖులు, అన్ని కులాలకు చెందిన పెద్దలు, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మాజీ కౌన్సిలర్లు సమావేశమై పండుగ తేదీని నిర్ణయించారు. ఈ సమావేశంలో పండుగ నిర్వాహనకు సంబంధించి ఏర్పాట్లపై గుడి చైర్మన్ పన్నాల రాఘవరెడ్డి సభ్యులతో కలిసి చర్చించారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.